
నీవు లేక.. నేను లేను!

తమ్ముడి మృతిని తట్టుకోలేక అన్న ఆత్మహత్య

లక్షుంపల్లిలో ఘటన...

ఆలస్యంగా వెలుగులోకి..


గుండెపోటుతో మృతిచెందిన బలరాముడు (ఫైల్)


ఆత్మహత్య చేసుకున్న దాసరి చంద్ర (ఫైల్)

యాడికి, జూలై 28: తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక అన్న దాసరి చంద్ర (58) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో జరిగింది. ఈ సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు మండలంలోని లక్షుంపల్లి గ్రామానికి చెందిన దాసరి చంద్ర, దాసరి బలరాముడు అన్నదమ్ములు. ఇద్దరూ వేర్వేరుగా నివసిస్తున్నారు. అన్నదమ్ములిద్దరూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. కష్టసుఖాల్లో అన్నదమ్ములిద్దరూ ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండేవారు. ఈ నెల 26న దాసరి బలరాముడు గుండె పోటుతో మృతిచెందాడు. తమ్ముడి మరణాన్ని జీర్ణించుకోలేక దాసరి చంద్ర విలవిలలాడిపోయాడు. తమ్ముడి అంత్యక్రియలకు వెళ్లాడు. అయితే ఇంటికి తిరిగి వెళ్లలేదు. ఎక్కడికో వెళ్లి ఉంటాడు.. వస్తాడులే అని కుటుంబ సభ్యులు భావించారు. పనుల కోసం ఆదివారం ఉదయం తోట వద్దకు వెళ్లారు. అక్కడ చెట్టుకు ఉరివేసుకుని ఉన్న దాసరి చంద్రను గమనించి బోరున విలపించారు. తమ్ముడి మరణాన్ని తట్టుకోలేకనే దాసరి చంద్ర ఆత్మహత్య చేసుకున్నాడని వారు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. దాసరి చంద్ర కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.


రాజకీయ వేధింపులు ఆపాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, జూలై 28: స్కీమ్ వర్కర్లపై జరుగుతున్న రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన అంగన్వాడీ యూనియన్ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కార్మికులను ఇబ్బంది పెట్టడంవల్లే ప్రజలు గద్దె దింపారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పగా, కొందరు స్థానిక నాయకులు రాజకీయ ఒత్తిళ్లకు పాల్పడుతూ వర్కర్లను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్‌కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించారని, నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు మొదటివారంలో ఆందోళనలు చేపడతామన్నారు. అనంతరం అంగన్వాడీలు సాగించిన 42 రోజుల సమ్మె అనుభవాలపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శకుంతల, రమాదేవి పాల్గొన్నారు.


జేఎన్‌టీయూ పరిపాలనా భవనం



చంద్రబాబు అభివృద్ధికి వైసీపీ ముసుగు

జేఎన్‌టీయూఏ భవనాలకు అప్పట్లో రూ.120 కోట్లు

- పనులు మొదలైనా.. వైసీపీ హయాంలో నత్తనడక
- గత ఏడాది ప్రారంభించిన వైసీపీ ప్రభుత్వం
- చంద్రబాబు ఆవిష్కరించిన శిలాఫలకం తొలగింపు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పునరుద్ధరించిన ఇన్‌చార్జి వీసీ

అంతపురం సెంట్రల్, జూలై 28: వైసీపీ ప్రభుత్వంలో వర్సిటీల అభివృద్ధిని అటకెక్కించారు. మౌలిక సదుపాయాల కల్పనను విస్మరించారు. పైగా.. అంతకు మునుపు టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని తామే చేసినట్లుగా చూపించుకున్నారు. ఇందుకు నిదర్శనం.. అనంతపురం జేఎన్‌టీయూలో అధునాతన భవనాల నిర్మాణం. 2014-19లో టీడీపీ ప్రభుత్వం అనంతపురం జేఎన్‌టీయూలో రూ.120 కోట్లతో అధునాతన భవన నిర్మాణ పనులను చేపట్టింది. 2017 ఏప్రిల్ 20న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా శిలాఫలకాలను ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో కూడిన పరిపాలనా భవనం, లెక్చరర్ హాల్, ఫార్మసీ బిల్డింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, జిమ్ అండ్ యోగా సెంటర్ వంటి నూతన భవనాల నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులు కొనసాగుతున్న సమయంలో, 2019 సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం కొలువు తీరింది. అక్కడి నుంచి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. చివరికి గత సంవత్సరం పూర్తి అయ్యాయి. నూతన భవనాలను ప్రారంభించే క్రమంలో అప్పట్లో సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించిన శిలాఫలకాలను దాచేశారు. వాటి స్థానంలో కొత్త శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, వర్సిటీ యాజమాన్యం మారడంతో అప్పట్లో దాచిన శిలాఫలకాన్ని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు బయటకు తీయించారు. శిలాఫలకాన్ని తిరిగి ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా 2014-19లో టీడీపీ ప్రభుత్వం జేఎన్‌టీయూలో చేసిన అభివృద్ధిని గురించి వివరిం

అభివృద్ధి హైజాక్

చారు. జనవరి 6న నిర్వహించిన జేఎన్‌టీయూ స్నాతకోత్సవాలకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. అదే సమయంలో అప్పటికే పూర్తి అయిన పరిపాలనా భవనాన్ని గవర్నర్ చేత ప్రారంభింపజేశారు. స్నాతకోత్సవం నిర్వహించిన ఎన్‌టీఆర్ ఆడిటోరియానికి.. నూతన పరిపాలనా భవనానికి కొన్ని వందల అడుగులు మాత్రమే దూరం ఉంది. గవర్నర్ నేరుగా అక్కడికే వెళ్లి నూతన భవనాన్ని ప్రారంభించవచ్చు. స్నాతకోత్సవ వేదికమీదనే ఈ తతంగాన్ని పూర్తి చేయించారు. ఇన్‌చార్జి వీసీ పాత శిలాఫలకాన్ని పునరుద్ధరించడంతో 'వైసీపీ ప్రభుత్వం' హైజాక్ గురించి వర్సిటీలో చర్చ జరిగింది.



జేఎన్‌టీయూని భ్రష్టుపట్టించారు

మానవ వనరుల తయారీ కేంద్రంలాంటి జేఎన్‌టీయూని గత వైసీపీ ప్రభుత్వంలో భ్రష్టు పట్టించింది. సాంకేతిక పరిజ్ఞానానికి, పారదర్శకతకు మారుపేరైన వర్సిటీ ప్రతిష్ఠను దేశస్థాయిలో దిగజార్చారు. ఈ ప్రభావం విద్యార్థులు, ప్రొఫెసర్లపై పడుతోంది. వేలాదిమంది విద్యార్థులు ప్రతియేటా జేఎస్‌టీయూ అందజేసే పట్టాలను పుచ్చుకుని గ్రాడ్యుయేట్స్‌గా సమాజంలోకి అడుగుపెడుతున్నారు. వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో వర్సిటి అడ్మినిస్ట్రేషన్, అకడమిక్, ఎగ్జామినేషన్ తదితర అనేక విభాగాలు పనిచేయాల్సి ఉంటుంది. ఈ అంశాల్లో రాజకీయాన్ని చొప్పించి ఫ్యాకల్టీ మధ్య విబేధాలు సృష్టించి అధోగతి పాలు చేశారు. ఇకనుంచి జేఎన్‌టీయూ పరిపాలనను గాడినపెట్టి వర్సిటీకి పూర్వవైభవాన్ని తీసుకువస్తాం.

- సుదర్శన రావు, ఇన్‌చార్జ్ వీసీ



సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శిలాఫలకాన్ని పునరుద్ధరించిన ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు

తస్మాత్ జాగ్రత్త

దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టండి: కలెక్టర్

అనంతపురం టౌన్, జూలై 28: ప్రస్తుత వర్షాకాలంలో రోగాలు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టరు వినోద్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో అధికారులు ఆదేశించారు. వర్షాకాలంలో తాగు నీరు కలుషితం కావడంతో పాటు దోమలు వృద్ధి చెందడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు, ప్రధానంగా డయేరియా, కామెర్లు, టైఫాయిడ్, చికున్‌గున్యా, డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అందుకే రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ గ్రామాలలో పారిశుధ్యం, దోమల నివారణకు అక్టోబరు 8వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగించాలని ఉత్తర్వులు ఇచ్చినట్లు వెల్లడించారు. ఆమేరకు జిల్లాలో తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడం, క్లోరినేషన్ చేయడం, డ్రైనేజీలు శుభ్రం చేయడం, చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలు తొలగించడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం వంటి కార్యక్రమాలు ప్రతిరోజు సంబంధిత శాఖల అధికారులు చేయించాలని కలెక్టరు ఆదేశించారు.

శిశువు మిస్సింగ్... కలకలం

జిల్లా ఆస్పత్రిలో ఘటన

మంచిగా మాట్లాడి సర్వజనాస్పత్రి నుంచి ఓ పాపను ఎత్తుకెళ్లిన ఆమని అనే మహిళ పోలీసులకు చిక్కింది. తన స్నేహితు రాలి కుమార్తె జిల్లా కేంద్రంలోని ప్రభుత సర్వజన ఆస్పత్రిలో కాన్పు కావడంతో ఆమెను చూడటానికి బాలింత తల్లితో పాటు వచ్చింది. రాత్రికి అక్కడే బాలింతకు తోడుగా పడుకుంది. స్నేహితురాలి కుమార్తెకు ఆరాత్రి ఎన్నో నీతులు చెప్పింది. చివరకు తెల్లవారుజామున పక్కన ఉన్న మరో బాలింత బిడ్డను గుట్టుచప్పుడు కాకుండా ఎత్తుకెళ్లింది. ఐదు రోజుల పసికందు అదృశ్యమైన ఘటన ఆదివారం జిల్లా ఆస్పత్రిలో తీవ్రకలకలం సృష్టించింది. పోలీసులు రంగంలోకి దిగి మూడుగంటలలో ఈపాప అదృశ్యం కేసును చేదించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

- స్నేహితురాలి బిడ్డను చూసేందుకు వచ్చి మరొకరి శిశువును ఎత్తుకెళ్లిన మహిళ
- సీసీ పుటేజీలో నిందితురాలి గుర్తింపు
- బిడ్డను తల్లి ఒడికి చేర్చిన పోలీసులు


నారాయణపురంలోని ఓ ఇంటిలో పాపను స్వాధీనం చేసుకుని తీసుకొస్తున్న పోలీసులు

అనంతపురం టౌన్, జూలై 28: జిల్లా సర్వజనాస్పత్రిలో ఐదు రోజుల పసికందు అదృశ్యమైన సంఘటన ఆదివారం కలకలం రేపింది. పోలీసులు మూడు గంటల్లోను కేసును ఛేదించి, బిడ్డను తల్లి ఒడికి చేర్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం నాగలూరు గ్రామానికి చెందిన అమృత ప్రసవం కోసం ఈనెల 23న అనంత జిల్లా ఆస్పత్రికి వచ్చింది. ఆమె అదే రోజు ఆడ శిశువును ప్రసవించింది. తొలి మూడురోజులు ఐసీయూలో ఉంచి రెండు రోజుల కిందట సాధారణ లేబర్‌వార్డుకు మార్చారు. అయితే ఆదివారం తెల్లవారుజామున పసిపాప కనబడకుండా పోయింది. దీంతో ఆస్పత్రిలో కలకలం రేగింది. వెంటనే వైద్యాధికారులు, పోలీసులకు సమాచారం వెళ్లింది. డీఎస్పీ ప్రతాప్, సీఐలు క్రాంతికుమార్, ప్రతాప్‌రెడ్డి తమ సిబ్బందితో రంగంలోకి దిగారు. ఆస్పత్రిలో ఉన్న సీసీపుటేజీని పరిశీలించారు. అందులో పాపను ఎత్తుకెళ్లిన మహిళను గుర్తించారు.


- **అన్నం తెచ్చిన సంచిలోనే ...**

ఆమని అనంతపురం రూరల్ మండలం నారాయణపురంలో ఉంటున్నారు. ఇంటి పక్కనే ఉంటున్న తన స్నేహితురాలి కుమార్తె శ్రుతి ఆస్పత్రిలో డెలివరీ కావడంతో ఆమెను చూసేందుకు శనివారం వచ్చింది. భోజనం క్యారియర్‌తో పాటు ఓ సంచి కూడా తీసుకువచ్చింది. రాత్రి బాలింతతో పాటు ఆమె తల్లి, ఆమని కలిసి ఆనందంగా మాట్లాడుకుంటూ అన్నం తిన్నారు. అదే సమయంలోనే పక్క బెడ్‌పై ఉన్న నాగలూరుకు చెందిన బాలింత అమృత, ఆమె తల్లితో ఆమని పరిచయం పెంచుకుంది. ఇంతకుముందే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, మళ్లీ కుమార్తె పుట్టిందని అమృత తల్లి శకుంతల ఆమని వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. ఈక్రమంలో ఆమని తెల్లవారుజామున మూడుగంటల సమయంలో అందరూ నిద్రిస్తుండగా అమృతకు పుట్టిన శిశువును క్యారియర్ తెచ్చిన సంచిలో ఉంచుకొని ఎత్తుకెళ్లింది. ఆస్పత్రినుంచి నేరుగా నారాయణపురంలో ఉన్న స్నేహితురాలి బంధువు ఇంటికి వెళ్లి అక్కడ ఆ పాపను ఉంచింది. ఎవరికీ అనుమానం రాకుండా తిరిగి ఆస్పత్రికి చేరుకొంది. అయితే సీసీ పుటేజీలో ఆమని ఓ సంచి తీసుకెళ్లడం గుర్తించిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. అదే సమయంలో నారాయణపురం గ్రామంలోని తమ ఇంటిలో పసిపాపను ఉంచినట్లు ఆ ఇంటి యజమానులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ, సీఐలు అక్కడకు వెళ్లి ఆ చిన్నారిని తీసుకొచ్చి, తల్లికి అప్పగించారు. ఆ పాపను ఆస్పత్రిలోని ప్రత్యేకవార్డులో ఉంచి వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. చిన్నారి ఆరోగ్యంగా ఉన్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

- **నలుగురిపై వేటు**

ఆస్పత్రిలో పాప మిస్సింగ్ వ్యవహారంలో నలుగురిపై వేటు పడింది. వార్డులో రాత్రిడ్యూటీలో ఉన్న ఇద్దరు స్టాఫ్‌నర్సులు శ్రవణమ్మ, సువర్ణమ్మలను సస్పెండ్ చేశారు. ఎఫ్ఎన్ఓ సుజాత, మహిళా సెక్యూరిటీ గార్డు సునీతను విధుల్లో నుంచి తొలగించినట్లు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు.

నాలుగున్నరప్పుడు చూసుకున్నా: అమృత, పాప తల్లి



ఆమని అనే ఆమె శనివారం రాత్రి మాతోనే ఉంది. మా మంచం మధ్యలోనే వారు పడుకున్నారు. మాపాప అర్ధరాత్రి వరకు ఏడుస్తూ ఉండగా నేను మేల్కొని ఉన్నా. పాపకు కడుపు నొప్పేమోనని చుక్కలు వేశాను. ఆతర్వాత పడుకున్నా. తిరిగి నాలుగున్నర సమయంలో మెలకువ రాగా చూస్తే పక్కన పాప కనిపించలేదు. లేచి మా అమ్మకు చెప్పా. ఎవరో ఎత్తుకెళ్లారని తెలుసుకొని ఇంటికి ఫోన్‌చేశా. పోలీసులు నాబిడ్డను వెతికి నాకు అప్పగించారు. ఆనందంగా ఉంది.

అలా చేస్తాదని ఎలా అనుకుంటాం?: శ్రుతి పక్కనే ఉన్న మరోబాలింత




ఆమని అనే ఆమె మాకు దాదాపు 12ఏళ్లుగా పరిచయం. మాఇళ్లవద్దనే ఉండటంతో మా అమ్మ వాళ్లతో పాటు నాకు చిన్నప్పటి నుంచి బాగా తెలుసు. ఆ పరిచయంతోనే నన్ను చూడడానికి ఆస్పత్రికి వచ్చిందనుకున్నాం. అన్నం కూడా కలిసే తిన్నాం. ఇలా బిడ్డను ఎత్తుకెళుతుందని అనుకోలేదు. ఆమెకు ఇప్పటికే ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఇలా ఎందుకు చేసిందో నాకే అర్థంకావడంలేదు

రాత్రంతా వార్డులో తిరుగుతూ ఉంది: షాను, పక్కవార్డులో ఉన్న మరో బాలింత తల్లి



పాపను ఎత్తుకెళ్లిన ఆమని అనే ఆమె రాత్రంతా బాలింతల వార్డులో తిరుగుతూ కనిపించింది. పక్కనే ఉన్న మావార్డుకు వచ్చి నా కూతురుకు పుట్టిన బిడ్డ వద్దకు వచ్చి ఎంత ముద్దుగా ఉందో ఆడపాప, మగబిడ్డ అని అడిగింది. మగబిడ్డ అని చెప్పగా ఆడబిడ్డ అయితే నేను ఎత్తుకెళ్లేదాన్ని అనింది. ఏదో తమాషాగా అంటోందని అనుకున్నా. కానీ అన్నంత పనిచేసింది. ఇలాంటోళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.


కుప్పగా పోసిన టమోటా


టమోటాను బాక్సుల్లోకి నింపుతున్న కూలీలు

పతనం మొదలైందా..?

నేల చూపులు చూస్తున్న టమోటా ధరలు

మొన్నటి వరకు 16 కిలోల బాక్స్ రూ. 900

నేడు రూ. 300కు పడిపోయిన వైనం

నిలకడలేని ధరలతో రైతుల ఆందోళన

కళ్యాణదుర్గం, జూలై 28: నిన్న మొన్నటి దాకా ఓ రేంజ్‌లో రైతులకు లాభాలు కురిపించిన టమోటా ప్రస్తుతం నేల చూపులు చూస్తోంది. మొన్నటి వరకు అనంతపురం, కర్ణాటకలోని కోలార్ మార్కెట్‌లో 16 కేజీల టామోటా బాక్స్ రూ.900లు పలికింది. అది ప్రస్తుతం రూ. 300లకు పడిపోయింది. ఈ ధరలు ఇంకా తగ్గే అవకాశాలు ఉన్నాయి. వారం రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజక వర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 390 ఎకరాలకు పైబడి టమోటా పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.లక్ష ఖర్చు చేసి, ఒక్కో రైతు సరాసరి రెండున్నర ఎకరాలకు పైబడి సాగు చేశారు. టమోటా పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. ఇలాంటి సమయంలో ధరలు పడిపోతుండటంతో పెట్టుబడి కూడా గిట్టదేమోనని అన్నదాతలు ఆకోశిస్తున్నారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో దిగుబడి కూడా బాగా పెరగడంతో మార్కెట్‌లకు టమోటా భారీగా వస్తోంది. టమోటా పంటను కొనేందుకు మొన్నటివరకు వ్యాపారస్తులు ఎగబడ్డారు. దీంతో ధరలు నిలకడగా ఉంటాయన్న ఆశతో రైతులు విపరీతంగా టమోటాను సాగు చేశారు. అయితే వారం రోజుల వ్యవధిలోనే ధర పతనం అవడంతో పంట సాగు చేసిన రైతుకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. జిల్లా నుంచి ఎగుమతి చేసే ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎగుమతులు ఆగిపోయాయి. దీంతో టమోటా ధర భారీగా పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు.


టమోటా పంటను కోస్తున్న కూలీలు

• వారం రోజుల్లోనే...



నాకున్న మూడు ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశా. వారం రోజుల కిందట 16 కిలోల టమోటా బాక్స్ రూ.900లకు అమ్ముడుపోయింది. అదే ధర ఇప్పుడు రూ. 300లకు పడిపోయింది. ఇలా ధర ఒక్కసారిగా పడిపోవడంతో ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు.

- రామాంజనేయులు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

• పెట్టుబడి కూడా వస్తుందో.. రాదో..



నాకున్న మూడు ఎకరాలలో టమోటా పంట సాగు చేశా. వారం రోజుల కిందట 16 కిలోల బాక్స్ ధర రూ. 900లు ఉండేది. కానీ నేడు అది రూ. 300లకు పడిపోయింది. ఈ ధరలు ఇలాగే కొనసాగితే పెట్టుబడి కూడా దక్కే అవకాశం లేదు. టమోటా సాగు చేయాలంటే భయమేస్తోంది.

- రవి, రైతు, ఒంటారెడ్డిపల్లి

•నట్టేట మునుగుతున్నాం



టమోటా ధరలు నిలకడగా ఉండటం లేదు. వారం రోజుల కిందట ఉన్న ధరలు ఇప్పుడు లేవు. టమోటా కాయ బాగుంటేనే బాక్స్ రూ. 300లు ధర పలుకుతోంది. అదే మచ్చలు, పుచ్చులు ఉన్న టమోటాను నోసేల్ అంటున్నారు. ఇలా అయితే పెట్టుబడి కూడా దక్కక నట్టేట మునిగే పరిస్థితి ఏర్పడుతుంది.

- బొమ్మన్న, రైతు, ఒంటారెడ్డిపల్లి

తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి

- ఆర్‌యూపీపీ నాయకులు



మాట్లాడుతున్న రాష్ట్ర సహాధ్యక్షుడు ఎర్రిస్వామి


అనంతపురం విద్య, జూలై 28: రాష్ట్రంలోని పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో బోధన లేకపోవడం బాధాకరమనీ, వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పడింత పరిషత్ (ఆర్‌యూపీపీ) నాయకులు కోరారు. ఆదివారం ఆ సంఘం నాయకులు ఓ స్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు ఎర్రిస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో తెలుగు మాధ్యమం లేకుండా కేవలం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే బోధించాలంటూ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని విద్యార్థులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు మాధ్యమంలో బోధన లేకపోవడం వల్ల అటు ఇంగ్లీష్, ఇటు తెలుగు సంపూర్ణంగా రాక విద్యార్థుల్లో విషయ అవగాహన చేసుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. విలీనం చేసిన 3,4,5 క్లాసులను ప్రైమరీ స్కూళ్లలో తిరిగి చేర్చాలని, విద్యావ్యవస్థకు శరాఘాతంగా మారిన 117 జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమేష్, ప్రధానకార్యదర్శి తులసిరెడ్డి, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, ఇతర నాయకులు వెంకటేష్, గోపాల్,నవీన్ కుమార్, వెంకటరమణారెడ్డి, ధనుంజయ, రవికుమార్ పాల్గొన్నారు.

పీఏబీఆర్‌లోకి తుంగభద్ర నీరు


కాలువను పరిశీలిస్తున్న అధికారులు

కూడేరు, జూలై 28: తుంగభద్ర డ్యాం నుంచి విడుదల చేసిన నీరు లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్ డ్యాంలోకి ప్రవహిస్తోంది. ఆదివారం లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్ డ్యాంలోకి వస్తున్న నీటికి ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, డీఈ విశ్వనాథ్‌రెడ్డి, ఏఈ రామకృష్ణ, ఏఈఈ లక్ష్మీదేవి పూజలు చేశారు. ప్రస్తుతం పీఏబీఆర్ డ్యాంలో నీటిమట్టం అర టీఎంసీకి పడిపోయింది. గత ఏడాది తుంగభద్ర డ్యాం నుంచి 2. 158 టీఎంసీల నీరు మాత్రమే పీఏబీఆర్‌లోకి రావడంతో మొత్తం 3.285 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది వర్షాలు సక్రమంగా రాకపోవడంతో నీటి కొరత తీవ్రమైంది. డ్యాంలోనున్న శ్రీరామిరెడ్డి, సత్యసాయి, అనంతపురం పట్టణం, ఉరవకొండ తాగునీటి పథకాలకు నీటిని వినియోగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో కుడికాలువ నీరు వదలలేదు. డ్యాంలో నీటి మట్టం రోజు రోజుకు పడిపోవడం, తాగునీటి పథకాలకు నీరు అందక ఆందోళన చెందుతున్న తరుణంలో తుంగభద్ర డ్యాం నీరు రావడం కాస్త ఊరటనిచ్చింది. ఈ ఏడాది కుడికాలువకు నీరు వదలాలని రైతులు నుంచి డిమాండ్ పెరుగుతుండటంతో ఇరిగేషన్ అధికారులు ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

తగ్గని వరద


తుంగభద్ర డ్యాం 33 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలిన దృశ్యం

బొమ్మనహాళ్, జూలై 28: తుంగభద్ర జలాశయానికి ఆదివారం భారీ ఎత్తున వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు డ్యాం 33 క్రస్ట్ గేట్లను (23 గేట్లు నాలుగు అడుగులు, 10 గేట్లు ఒక్క అడుగు) ఎత్తి 1,56,871 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఇందులో తుంగభద్ర నదికి జలాశయం పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో 1,46, 288 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయం రక్షణ చర్యల్లో భాగంగా గేట్లన్నీ ఎత్తిన తుంగభద్ర బోర్డు అధికారులు వచ్చిన వరదనీటిని వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు. 1633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న ఈ జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 1630 అడుగులతో 97.791 టీఎంసీల నీరు నిల్వ ఉంది. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 826 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

టమోటా కిలో రూ.30

అనంతపురంరూరల్, జూలై 28: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 1425 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.17 పలికినట్లు ఆయన తెలిపారు.

వైసీపీ పాపానికి అనాథల్లా సచివాలయ ఉద్యోగులు

ఉద్యోగభద్రత కల్పించాలి

జీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

ఉద్యోగులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న కేఆర్ సూర్యనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 28: గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపానికి సచివాలయ ఉద్యోగులు తల్లిదండ్రులు లేని అనాథల్లా ఉండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఈ పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ కోరారు. ఆదివారం స్థానిక ఆదివారం స్థానిక పాతూరులోని పద్మావతి ఫంక్షన్‌హాల్‌లో ఏపీ గ్రామ-వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ జగన్ నాయకత్వంలోని గత వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేయడంలో భాగంగానే నిరుద్యోగ యువతీ, యువకులను గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగాల పేరుతో మోసం చేసిందని మండిపడ్డారు. ఉన్నత విద్యావంతులు, లక్షల్లో వేతనాలు తీసుకుంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం ప్రభుత్వ ఉద్యోగమనే ఆశతో వచ్చి సచివాలయ ఉద్యోగాల్లో చేరారన్నారు. అయితే రెండేళ్ల పాటు రూ.15వేలు వేతనంతోనే వెట్టిచాకిరీ చేయించుకున్నారని విమర్శించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా సచివాలయ ఉద్యోగాల నియామక ప్రక్రియ చేస్తుంటే అప్పటి సీఎస్, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఎందుకు ప్రశ్నించలేకపోయారని నిలదీశారు. గత ప్రభుత్వం చేసిన పాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులు సఫలమయ్యారని ఈ క్రమంలో ఏర్పాటైన నూతన ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు గత ప్రభుత్వ వైఫల్యాలు, స్కాంలు, నిధుల దుర్వినియోగం, అక్రమ కేసులు, అరాచక పాలనపై శ్వేతపత్రాలు విడుదల చేయడం శుభపరిణామమన్నారు. ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పింఛన్లు ఇవ్వాలని, లోపభూయిష్టంగా తీసుకువచ్చిన జీపీఎస్ రద్దు చేయాలని గవర్నర్ కలిసి విన్నవించిన పాపానికి తనను పోలీసుల చేత చంపించాలని చూసిన దుర్మార్గుడు జగన్ అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వెంటనే జీపీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని గత ప్రభుత్వంలో శాంతియుత ఆందోళన చేసిన ఉద్యోగులపై అక్రమంగా బనాయించిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్‌రజాక్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి, ఒకే అధికారి అజమాయిషీలో జాబ్‌చార్ట్ కింద పనిచేసే వాతావరణాన్ని తీసుకు వచ్చి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు వరప్రసాద్, కార్యదర్శి వీకే లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, ఉపాధ్యక్షులు శివశంకర్, సాకే రామాంజినేయులు, హనుమంత, శివరాజు, నాయకులు మణికంఠ, మౌలాలమ్మ, ప్రియాంక, కళావతి, విమల, జైనూబీ పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ


ప్రవచనం చేస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ


కళాకారుల నృత్య ప్రదర్శన

అనంతపురం కల్చరల్, జూలై 28: ప్రపంచ దేశాల్లో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు ఉందని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ పేర్కొన్నారు. రామకృష్ణ సేవాసమితి 20వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం సాయంత్రం స్థానిక జీఆర్ ఫంక్షన్ హాల్‌లో షణ్ముఖశర్మ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు శ్రీనృత్యకళానిలయం నాట్యాచార్యురాలు సంధామూర్తి శిష్యబృందం శివపదం కీర్తనలకు నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. అనంతరం సామవేదం షణ్ముఖశర్మ భక్తులకు అనుగ్రహభాషణం చేస్తూ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం భారతదేశమని, ఇక్కడ ఉన్నన్ని సంస్కృతులు, సంప్రదాయాలు మరే దేశంలోనూ లేవని పేర్కొన్నారు. అందువల్లే ప్రపంచదేశాల్లో భారతదేశానికి ఇంతటి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. భారతదేశస్థులమని తెలియగానే ఏ దేశస్థులైనా మనకు నమస్కారం చేయాలనే భావన కలుగుతుందంటే మన సంస్కృతి, సంప్రదాయాల ప్రాశస్త్యం అర్థం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ శ్రీకృష్ణశశి, కార్యదర్శి ప్రవీణ్, సహాయ కార్యదర్శి శ్రీధరమూర్తి, వేణుగోపాల్, సంధ్యామూర్తి పాల్గొన్నారు.

రాయలసీమ కవి కంఠం మల్లెల

పుస్తకావిష్కరణ సభలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, జూలై 28: రాయలసీమ ప్రాంత ప్రజల నిర్దిష్ట జీవితాన్ని వాస్తవిక దృక్పథంతో రాసిన కవి, రాయలసీమ సంస్కృతి, సంక్షేమంకోసం నిరంతరం సాహిత్యాన్ని సృష్టిస్తున్న కవి కంఠం మల్లెల నరసింహమూర్తి అని వక్తలు కొనియాడారు. కవి మల్లెల నరసింహమూర్తి రచించిన 'మాకూ ఒక నది కావాలి', 'మట్టి తంబూర' కవితా సంపుటాల ఆవిష్కరణ సభను విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు డాక్టర్ శాంతినారాయణ ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేసి ప్రసంగించారు. సమాజంలోని వాస్తవిక పరిస్థితులను పసిగట్టి మల్లెల సాహిత్యం రాశారన్నారు. డాక్టర్ బండారు ప్రసాద్‌మూర్తి మాట్లాడుతూ ఒక తాత్విక చింతన, హృదయ తడి ఉన్న కవి మల్లెల అని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి మాట్లాడుతూ రాయలసీమకు దశాబ్దాల నుంచి నీటి సమస్య ఉందని, రాయలసీమకు నీళ్లు కావాలని కోరుకునే కవుల్లో మల్లెల ఒకరన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు లక్ష్మీనరసయ్య, విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ వెంకటరామిరెడ్డి, తూముచెర్ల రాజారాం, డాక్టర్ నాగేశ్వరాచారి, సడ్లపల్లి చిదంబరరెడ్డి, డాక్టర్ నానీల నాగేంద్ర, గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, బాలకొండ ఆంజనేయులు, కొత్తపల్లి సురేష్, జూటూరు షరీఫ్, షేక్ రియాజుద్దీన్, గాయకుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వైద్య విభాగం.. ఎంతో కీలకం

సదస్సులో అతిథులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

అనంతపురం టౌన్, జూలై 28: మానవాళి ఆరోగ్యకర జీవనవిధానానికి సామాజిక వైద్యశాస్త్ర విభాగం ఎంతో కీలకమని వైద్యకళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం జిల్లా మెడికల్ కళాశాలలో రాయలసీమస్థాయిలో పీజీలకు సామాజిక వైద్యశాస్త్రవిభాగంపై డాక్టర్ మధు ఆధ్వర్యంలో శిక్షణ సదస్సు నిర్వహించారు. సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యరంగం రోజురోజుకీ దూసుకుపోతోందన్నారు. ప్రతి వైద్యుడు నిత్యవిద్యార్థిలా చదువుకుంటూనే వృత్తిలో రాణించాలన్నారు. సామాజిక వైద్యవిధానం జీవన విధానంలో ప్రధానపాత్ర పోషిస్తుందన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థినికి మొమెంటో, సర్టిఫికెట్ అందజేస్తున్న సభ్యులు

తాడిపత్రి/అనంతపురం క్లాక్‌టవర్, జూలై 28: భీమవరంలో ఈనెల 27, 28తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-11 చదరంగం పోటీల్లో ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని అనిమి యశశ్విని అత్యున్నత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినికి అభినందించారు. యశశ్విని జాతీయస్థాయికి ఎంపికకావడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు.

పశువుల సంత ఆదాయం రూ.2.73 లక్షలు

అనంతపురంరూరల్, జూలై 28: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.2,73,860 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,53,600, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,20,260 వచ్చిందని తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు



మాట్లాడుతున్న హృదయరాజు

అనంతపురం విద్య, జూలై 28: విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల 117 జీవో తీసుకొచ్చి ప్రైమరీ స్కూళ్లను నాశనం చేసిందన్నారు. 3,4,5 క్లాసుల విలీనం, ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్ అంటూ అనేక అసంబద్ధ కార్యక్రమాలు తెచ్చి వ్యవస్థను సమస్యల సుడిగుండంగా మార్చారంటూ మండిపడ్డారు. కొత్త ప్రభుత్వం వీటిని పరిష్కరించాల్సి ఉందన్నారు. అదేవిధంగా ఏపీజీఎల్ఐసీ,పీఎఫ్ విభాగాల్లో పేరుకుపోయిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. 12వ పీఆర్సీ ఆలస్యం నేపథ్యంలో వెంటనే ఐఆర్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కులశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకట సుబ్బయ్య, విశ్వనాథ్‌రెడ్డి, మహమ్మద్‌రఫీ, శ్రీనివాస్ నాయక్, సత్యప్రసాద్, రవీంద్ర, తిమ్మప్ప, అశోక్ , ఆంజినేయులు, సాయి తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న రమణారెడ్డి

అనంతపురం విద్య, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం టీచర్లు, ఉద్యోగులు ఆకాంక్షలకు అనుగుణంగా 12వ పీఆర్సీకి సంబంధించిన ఐఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. గత పీఆర్సీ బకాయిలను, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాప్రధానకార్యదర్శి రామాంజినేయులు మాట్లాడుతూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీవో 117ను రద్దు చేయాలన్నారు. 3,4,5 క్లాసును మళ్లీ ప్రైమరీ స్కూళ్లలో కలపాలని కోరారు. ఇంగ్లీష్ మీడియంతోపాటు, తెలుగు మీడియం కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 98,2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్, శివయ్యాచారి, సురేష్‌బాబు, రాజశేఖర్, మహమ్మద్‌రఫీ, నాగభూషణం, మల్లికార్జున, కృష్ణమూర్తి, రాజన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

గుత్తికోటను సందర్శించిన ఆర్డీటీ బృందం


కోటలో పర్యటిస్తున్న ఆర్డీటీ డైరెక్టర్ విశాలాఫెర్రర్

గుత్తి, జూలై 28: పట్టణంలోని గుత్తికోటను ఆదివారం ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్ తన బృందంతో సందర్శించారు. కోటలోని పలు అద్భుతాలను, కట్టడాలను తిలకించారు. కోట కట్టడాలు అద్భుతంగా ఉన్నాయని కోటను ప్రభుత్వం అభివృద్ధి చేస్తే బాగుంటుందన్నారు. గుత్తికోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ కోట చరిత్ర పుస్తకాన్ని ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, కోటగైడ్ రమేష్, నాయకులు చిరంజీవి, జిలాన్, హర్షద్, పురవస్తు శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పనిచేస్తూ కుప్పకూలిపోయిన రైతు

-ఆస్పత్రికి తరలించేలోపు మృతి..


నవీన్ కుమార్ (ఫైల్)

కళ్యాణదుర్గం (కంబదూరు), జూలై 28: అందరితో హాయిగా, అప్పటి వరకు నవ్వుకుంటూ టమోటా తోటలో పనిచేస్తున్న ఓ రైతు ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. కంబదూరు మండలం కొత్తపల్లికి చెందిన రైతు నవీన్‌కుమార్(32) ఆదివారం టమోటా తోటలో పనిచేయడానికి వెళ్లాడు. బాక్సులను కాయలతో నింపుతూ పనిచేసుకుంటూ ఉన్నాడు. టమోటా బాక్సులను మోసుకుంటూ పనిచేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. తోటి కూలీలు మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ మాట్లాడలేదు. వెంటనే కూలీలు ఆటోలో కంబదూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇతడికి 10 నెలల క్రితమే వివాహం జరిగింది. దీంతో తనకు దిక్కెవరంటూ భార్య దేవి భర్త మృతదేహంపై పడి విలపించడం కంటతడి పెట్టించింది. స్టేట్ లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ ఆవుల తిప్పేస్వామి మృతుడి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


నివేద్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 28: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు నివేద్ ఎంపికయ్యాడు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటల్లో ప్రతిభ చాటిన జిల్లాకు చెందిన క్రీడాకారుడు నివేద్ గోల్డ్‌మెడల్ సాధించి ఆగస్టు 2వతేదీ నుంచి విశాఖపట్నంలో నిర్వహించే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. ఎంపికైన క్రీడాకారుడికి, కోచ్ శ్రీకాంత్‌రెడ్డికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, గురుస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి శాంతరాజ్, సభ్యులు, కోచ్‌లు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలకు 324 మంది హాజరు

అనంతపురం సెంట్రల్, జూలై 28: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలకు 324మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ఆదివారం కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని జీవీ రమణ, సీఈ డాక్టర్ లోకేష్‌తోపాటు రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ చివరి సంవత్సరంలో ఐదు, ఆరు సెమిస్టర్ పరీక్షల్లో సబ్జెక్టులు మిగిలిపోయిన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఫలితాలను సోమవారం విడుదలచేస్తామని పేర్కొన్నారు.


పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న రెక్టార్, రిజిస్ట్రార్

ఎఫ్‌పీ షాపు డీలర్లపై చర్యలు తీసుకోండి

● డీఎస్‌ఓకు మంత్రి కేశవ్ ఆదేశం


డీఎస్‌ఓతో మాట్లాడుతున్న మంత్రి

ఉరవకొండ, జూలై 28: జిల్లాలో అవినీతి జరిగిన ఎఫ్‌పీ షాపు డీలర్లపై చర్యలు తీసుకోవాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శోభారాణిని ఆదేశించారు. అనంతపురంలోని మంత్రి నివాసంలో డీఎస్‌ఓ మంత్రిని కలిశారు. మంత్రి మాట్లాడుతూ రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. అలాగే మంత్రిని ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్ ఆదోని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ బస్టాండ్‌ల అభివృద్ధి బస్సుల కండీషన్‌పై ఆర్‌ఎంను అడిగి తెలుసుకున్నారు.

మంత్రి కేశవ్‌ను కలిసిన ఎస్పీ


మంత్రికి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం, జూలై 28: రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ కలిశారు. ఆదివారం స్థానిక రాంనగర్‌లోని మంత్రి నివాసంలో పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు, ఇతర అంశాలపై మంత్రితో ఎస్పీ చర్చించారు.

దళారీ వ్యవస్థను రద్దు చేయండి


మంత్రి కేశవ్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగ సంఘాల నాయకులు

అనంతపురం రూరల్, జూలై 28: విద్యుత్ సంస్థల్లో ఉన్న దళారీ వ్యవస్థను రద్దుచేసి సంస్థలే నేరుగా వేతనం చెల్లించాలని విద్యుత్ శాఖ బి-2841యూనియన్ నాయకులు కోరారు. ఆమేరకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను యూనియన్ నాయకులు కలిశారు. పలు సమస్యలను మంత్రికి వివరించారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చే విధంగా చూడాలన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్లూరు నాగార్జున, కంపెనీ కార్యదర్శి అమర్నాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి సునీల్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేంద్ర, శేఖర్ సుధాకర్‌శర్మ పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ కార్మికులకు న్యాయం చేయాలి

అనంతపురం కల్చరల్, జూలై 28: నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి, సత్యసాయి, సీపీడబ్ల్యూఎస్ స్కీముల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఓబులు మాట్లాడుతూ... వాటర్‌వర్క్స్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది నిరంతరం పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు బకాయి వేతనాలు, పీఎఫ్ చెల్లించి, కార్మిక సంక్షేమ చట్టాలు అమలుచేసి, ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఎర్రిస్వామి, ఈశ్వరయ్య, నాగరాజు పాల్గొన్నారు.

గొరవయ్యలకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి


గొరవయ్యల నృత్యవిన్యాసంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, రాజేష్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై28: జీవో పాధి లేక బతుకుతెరువు భారమై యాచక వృత్తిని ఎంచుకుంటున్న గొరవయ్యలకు ప్రతినెలా రూ.10 వేలు అందించి ఆదుకోవాలని మంత్రి సత్యకుమార్‌ను ఉరవకొండ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొనకొండ్ల రాజేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లాకొచ్చిన మంత్రిని గొరవయ్యలతో కలిసి రాజేష్ కలిసి సమస్యలను విన్నవించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది గొరవయ్యలు దీన పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. గొరవయ్యలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రతినెలా రూ.10 వేలు గౌరవ వేతనం అందించాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ... సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు రాజేష్ తెలిపారు.

జిల్లా చెస్ జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా చెస్ క్రీడాకారులతో కోచ్‌లు

అనంతపురం క్లాక్ టవర్, జూలై 28: జిల్లాస్థాయి చెస్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని ఆర్‌కే చెస్ అకాడమీలో జిల్లాస్థాయి అండర్-7 ఓపెన్ బాలికల చెస్ చాంపియన్‌షిప్-2024 ఎంపిక పోటీలు నిర్వహించారు. ఓపెన్‌లో ఈశ్వర్‌ప్రసాద్, ద్వితీయ స్థానంలో మయాంక్ అర్జున్, బాలికల విభాగంలో కాశి సమిక విజేతగా నిలవగా ద్వితీయ స్థానంలో ఎర్రం దివ్యలు నిలిచింది. విజేతలైన క్రీడాకారులు ఆగస్టు 3వతేదీ నుంచి విజయనగరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని టోర్నీ డైరెక్టర్ కిశోర్‌కుమార్, చీఫ్ ఆర్బిటార్ మల్లికార్జున తెలిపారు. విజేతలకు ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఉదయ్‌కుమార్ నాయుడు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఆర్బిటార్ కమల్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా షూటింగ్‌బాల్ జట్లు..

జిల్లా సబ్‌జూనియర్ షూటింగ్‌బాల్ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని సెయింట్‌జాన్స్ స్కూల్ మైదానంలో జిల్లా సబ్‌జూనియర్ షూటింగ్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. మొత్తం 70 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా 12 మంది బాలురు, 12మంది బాలికలను ఎంపిక చేసినట్లు జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అమరేంద్రయాదవ్ తెలిపారు. ఎంపికైన జట్లు ఆగస్టు 11వ తేదీ నుంచి కుప్పంలో నిర్వహించే రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. సంఘం సభ్యులు ధనుంజయ, మధు, తిప్పేస్వామి, శిరీష, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జట్లు..

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఎంపికైన జట్ల వివరాలను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్ మోహిద్దీన్, కార్యదర్శి వెంకటేశులు ప్రకటించారు. సబ్‌జూనియర్ బాలుర జట్టులో....జిలాన్, అల్తాఫ్, రాజశేఖర్, హర్షవర్ధన్, వీరేంద్ర, శివచరణ్, బ్రహ్మరాజు, మనోజ్, చిరంజీవి, సమర్‌లు ఎంపికయ్యారు. బాలికల జట్టులో...లక్ష్మి, విశాల, విద్య, సౌమ్య, సుకన్య, చరిత, మానస, శాంతి, సుప్రజ, రుషితలు ఉన్నారు. జూనియర్ బాలుర జట్టులో.. దుర్గాసాయి, శ్రీనాథ్, మదన్మోహన్, జిలాన్, రాజశేఖర్, అల్తాఫ్, ఇబ్రహీం, నిఖిల్, సాయి రక్షిత్, శ్రీనివాసులు ఎంపికయ్యారు. బాలికల జట్టులో శిల్ప, లక్ష్మి, సుస్మిత, చందన, గాయత్రి, కృష్ణవేణి, స్వాతి, భవిజ్ఞ, లక్ష్మి, గౌతమిలు ఎంపికయ్యారు. ఎంపికైన సబ్‌జూనియర్స్ ఆగస్టు మొదటి వారంలో అన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు, జూనియర్ జట్లు విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. సంఘం సభ్యులు ఫకృద్దీన్, వెంకట్, మహబూబ్‌బాషా, ఇలాహి, బాలాజీ పాల్గొన్నారు.

జలధికి తరలిన బీబీ ఫాతిమా పీర్లు

● పలు ప్రాంతాల్లో పండుగ సంబరం

అనంతపురం కల్చరల్, జూలై 28: జిల్లాకేంద్రం ఐదవరోడ్డులోని బీబీ ఫాతిమా పీర్లమకానం వద్ద నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పీర్లు జలధికి తరిలాయి. ఉదయం పురవీధుల్లో పీర్లను ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున హాజరై చక్కెర చదివింపులు చేశారు. సాయంత్రం పీర్లను ఊరేగిస్తూ హెచ్చెల్సీ కాలనీ వద్దకు చేరుకుని హెచ్చెల్సీ కెనాల్‌లో సంప్రదాయబద్దంగా జలధి కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఉదయం బీబీ ఫాతిమా అమ్మవారి పీరు చివరి దర్శనం నిర్వహించడంతోపాటు సాయంత్రం భక్తులకు అన్నదానం చేసి బ్రహ్మోత్సవాలను ముగించనున్నట్లు బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున వెల్లడించారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవ నిర్వాహకులు నరసింహులు, కేఎస్ మురళి, కిశోర్, మహేష్, చంద్రశేఖర్, అజ్జి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు

అనంతపురం కల్చరల్: వేణుగోపాల్ నగర్ 80 అడుగుల రోడ్డులో నిర్వహిస్తున్న చిన్నపీర్ల పండుగ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం చిన్నసరిగెత్తు వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీబీ ఫాతిమా, అల్లావలి, అంగార్‌వలి, ఇమామ్ హసేన్, ఇమామ్ హుసేన్ పీర్లను వీధుల్లో ఊరేగిస్తుండగా భక్తులు దర్శించుకుని చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కందుకూరి నాగరాజు, ఉపాధ్యక్షుడు జెబీవుల్లాఖాన్, కార్యదర్శి మొహమ్మద్ రఫి, కోశాధికారి వెంకటేష్, మాధవ, అంజి, నగేష్, మోహన, రమేష్, వెంకటేష్, మురళి, గోపి పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని రాప్తాడు, కొత్తపల్లి, గాండ్లపర్తి గ్రామాల్లో ఆదివారం పీర్ల జలధి కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున పీర్లను ఉరేగించారు. అనంతరం పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు.


జలధికి తరలుతున్న బీబీ ఫాతిమా పీర్లు

సాయంత్రం అగ్నిగుండం పూడ్చివేసి పీర్లను గ్రామ వీధుల్లో రేగించారు.

చెన్నేకొత్తపల్లి: మొహరం పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటైన పీర్లస్వాములను ఆదివారం జలధికి తరలించారు. చెన్నేకొత్తపల్లి, వెంకటంపల్లి గ్రామాలలో పీర్లను ఊరేగించారు.

రామగిరి: మండలంలోని కుంటిమద్ది, పోలేపల్లి, కలికివాండ్లపల్లి, రెడ్డివారిపల్లి, పాపిరెడ్డిపల్లి గ్రామాలలో ఆదివారం పీర్లపండుగను జరుపుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పీర్లను జలధికి తరలించారు.


పీర్ల అగ్నిగుండ ప్రవేశం


పొర్లుదండాలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


చెన్నేకొత్తపల్లిలో పీర్ల ఊరేగింపు


రాప్తాడులో...

కెప్టెన్ నారాయణప్ప సేవలు మరువలేనివి

● జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప


కెప్టెన్ నారాయణప్ప చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ సైనికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 28: యుద్ధ సమయాల్లో సైనికులకు కెప్టెన్ నారాయణప్ప అందించిన సేవలు మరువలేనివని జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప అన్నారు. ఈ మేరకు ఆదివారం మాసినేని గ్రాండ్‌లో కెప్టెన్ నారాయణప్ప సంస్మరణ సభను నిర్వహించారు. కార్యక్రమానికి ఆయనతో పాటు పలువురు మాజీ సైనికులు హాజరై నారాయణప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిమ్మప్ప మాట్లాడుతూ యుద్ధంలో నారాయణప్ప డాక్టర్‌గా ఎంతోమంది సైనికులకు సేవలందించారన్నారు. ఎంతోమంది గాయపడిన సైనికులకు తక్షణ చర్యల్లో భాగంగా వైద్యచికిత్సలు అందించారన్నారు. సైన్యం నుంచి తిరిగి వచ్చిన అనంతరం నగరంలో తాతా క్లినిక్‌ని ఏర్పాటు చేసి తక్కువ ధరతో వైద్యమందించారన్నారు. అలాంటి వ్యక్తి మరణించడం సైనికలోకానికి, పేద ప్రజలకు తీరని లోటన్నారు. సభలో నారాయణప్ప సతీమణి పార్వతమ్మ, కూమార్తెలు మీనా, రీనా, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న, గౌరవాధ్యక్షుడు వీకే రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, సభ్యులు తలమర్ల కృష్ణ, రామ్‌గోపాల్, బీఏ హుస్సేన్, వై. ప్రసాద్, గొల్ల ఈశ్వరయ్య, నాగరాజు, ఖాజామొయిద్దీన్, నరసింహులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు వైద్యశాఖ మంత్రిని కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సత్యకుమార్‌ను ఆ సంఘం నాయకులు కలిశారు. జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ మెడికల్ రంగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు, కాంట్రాక్టర్లు వేతనాలు సరిగా ఇవ్వడం లేదని కార్మికులకు నెలకు రూ.26వేల కనీస వేతనం అందేలా చూడాలన్నారు. ఈ మేరకు మంత్రికి వినతి పత్రం అందించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఇతర నాయకులు మల్లికార్జున, కృష్ణుడు, నాగవేణి, శ్రీనివాసులు, చిరంజీవి, రాజు పాల్గొన్నారు.

మెడికల్ షాపులో చోరీ

అనంతపురం క్రైం, జూలై 28: నగరంలోని ఓ మెడికల్ షాపులో ఆదివారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి పక్కనున్న వినాయకమెడికల్ షాపులో నలుగురు దొంగలు చొరబడ్డారు. క్యాష్‌కౌంటర్‌లోని రూ.5వేలుతో పాటు రెండు తులాల బంగారు గొలుసు చోరీ చేశారు. ఘటనపై దుకాణ యజమాని అనిల్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు.

విద్యుత్ పరికరాలు..

గార్లదిన్నె, జూలై 28: మండలంలోని బూదేడు గ్రామంలో నివాసముంటున్న జెన్నె మునెయ్యకు చెందిన వ్యవసాయ తోటలో శనివారం రాత్రి విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయి. బాధితుడు తెలిపిన మేరకు తనకున్న భూమిలో చీనీ చెట్లు సాగుచేసుకుంటూ జీవనం సాగించేవాడు. శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు వ్యవసాయ బోరుకు ఏర్పాటు చేసిన స్టార్టర్ పెట్టెను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం తోటలోకి వెళ్లి చూడగా విద్యుత్ పరికరాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీనిపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

పేకాట స్థావరంపై దాడి

గార్లదిన్నె, జూలై 28: మండలంలోని మర్తాడు క్రాస్ సమీపంలో ఆదివారం సాయంత్రం పేకాట స్థావరంపై డీఎస్పీ వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి 10 పది మందిని అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ గౌస్‌బాషా విలేకర్లతో మాట్లాడారు. మర్తాడు క్రాస్ సమీపంలోని ఓ చీనీతోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. దాడిలో 10 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4,11,700, 20 ద్విచక్ర వాహనాలు, 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట స్థావరానికి పోలీసులు వస్తున్నట్లు తెలుసుకున్న కొంతమంది పారిపోయారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గార్లదిన్నె, జూలై 28: మండలంలోని గుడ్డాలపల్లికి చెందిన ఆదినారాయణ (65) అనే వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. గుడ్డాలపల్లికి చెందిన ఆదినారాయణ ఐదు రోజుల క్రితం ద్విచక్రవాహనంలో కనుంపల్లి క్రాస్ వద్ద వెళుతుండగా మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆదినారాయణను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన వైద్యాధికారులు


మంత్రి సత్యకుమార్‌కు మొక్కను అందజేస్తున్న వైద్యాధికారులు

అనంతపురం టౌన్, జూలై 28: వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదివారం జిల్లాకొచ్చిన సందర్భంగా జిల్లా వైద్యాధికారులు ఆయనను కలిశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తమ శాఖలకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇదేసమయంలో ఆస్పత్రిలో పాప మిస్సింగ్ కేసుగురించి మంత్రికి సూపరింటెండెంట్ వివరించినట్లు తెలిసింది.

వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలి

● ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, జూలై 28: వ్యవసాయ రంగానికి నిధులు పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం క్లాక్‌టవర్ కూడలి వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పత్రాల ప్రతులను దహనం చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కాకులను కొట్టి గద్దలకు పెట్టేలా ఉందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి భారీగా నిధుల కోత పెట్టడం దారుణమన్నారు. ఆహార, ఎరువుల సబ్సిడీ, ఉపాధి హామీ నిధులలో కోతపెట్టి బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు ఇవ్వడమేనా వికసిత్ భారత్ అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నాయకులు నల్లప్ప, చెన్నారెడ్డి, రాముడు, రమీజా, మల్లికార్జున, గంగాధర, నాగమ్మ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలు కబ్జా

ఆత్మకూరు, జూలై 28: మండల కేంద్రంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేసి వైసీపీ నాయకులు ఆ స్థలాలను కబ్జా చేశారని, ప్రస్తుతం ఆ భూములనే టీడీపీ వారు కబ్జా చేశారనడం హాస్యాస్పదగా ఉందని మండల కన్వీనర్ శ్రీనివాసులు, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి, శశాంక చౌదరి అన్నారు. గ్రామంలో ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చాలని 5 ఎకరాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం ద్వారా సేకరించి 250 మందికి పట్టాలు అందజేస్తే వైసీపీ అధికారంలోకి రాగానే మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మద్దతుతో ఆ పార్టీ నాయకులు ఆక్రమించారని గుర్తు చేశారు. వైసీపీ నాయకుల మాయమాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. టీడీపీ నాయకులపై నిందారోపణలు చేస్తే సహించేది లేదన్నారు. మండల నాయకులు సుబ్బర హరి, కందుల ఓబులపతి, రాజశేఖర్, చికెన్‌వలి, బొమ్మయ్య, శేఖర్, పోతన్న, లక్ష్మీదేవి, చెన్నమ్మ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి ఆభరణాల బహూకరణ

గార్లదిన్నె, జూలై 28: మండలంలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు రూ.9500 విలువ చేసే వెండి ఆభరణాలను బహూకరించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే అనంతపురం నగర పరిధిలోని నారాయణపురానికి చెందిన బళ్లారి వెంకట్రాముడు, మల్లేశ్వరి దంపతులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం రూ.9500 విలువ చేసే 10 తులాల వెండి యజ్ఞోపవీతం ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులకు అందచేశారు.

తరిమెల నాగిరెడ్డి ఆశయ సాధనకు పోరాడుతాం

● రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 28: పీడిత వర్గాల కోసం శక్తివంచన లేకుండా పోరాడిన తరిమెల నాగిరెడ్డి ఆశయ సాధనకు పోరాడుతామని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ అన్నారు. తరిమెల నాగిరెడ్డి 48వ వర్ధంతి సందర్భంగా స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని తరిమెల నాగిరెడ్డి విగ్రహానికి రైతుకూలీ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టవర్‌క్లాక్ నుంచి ఎన్జీఓహోం వరకు కళాకారుల బృందం ప్రదర్శన నిర్వహించారు. రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సింహాద్రి ఝాన్సీ మాట్లాడారు. నాగిరెడ్డి కోర్టులో నివేదించిన తాకట్టులో భారతదేశంలో దోపిడీ వర్గాలు దోచుకుంటున్నాయని, ప్రధాని మోదీ దేశాన్ని సామ్రాజ్యవాదులకు అప్పగించారన్నారు. ప్రభుత్వాలు ఏవి మారినా దేశంలో ఎక్కడా అభివృద్ధి ఊసే లేదని, అభివృద్ధి పేరుతో దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. ఏపీఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పాండా ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టి గెలుస్తున్నా ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవ చేస్తామంటూ ఆస్తులు కూడగట్టుకుంటున్నారని విమర్శించారు. కర్ణాటక రాజ్య రైతు సంఘం నాయకులు మల్లికార్జునరెడ్డి, మాధవరెడ్డి, రైతుకూలీ సంఘం నాయకులు దస్తగిరి, మూర్తి, మల్లేశ్వరి పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

గార్లదిన్నె: బడుగు, బలహీనవర్గాల కోసం అలుపెరుగని పోరాటాలు చసిన తరిమెల నాగిరెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు పిలుపునిచ్చారు. తరిమెల నాగిరెడ్డి 48వ వర్ధంతిని పురస్కరించుకుని గార్లదిన్నెలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఏసురత్నం, ఓపీడీఆర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉపేంద్ర, అఖిల భారత రైతుకూలీ సంఘం కిష్ట, పెద్దన్న, రాజశేఖరశెట్టి, వీరనారప్ప, చంద్రప్ప పాల్గొన్నారు.

రైతులకు విద్యుత్ సమస్య రానివ్వద్దు

● విద్యుత్ శాఖ ఎస్ఈకి ఎమ్మెల్యే సూచన


ఎమ్మెల్యే పరిటాల సునీతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్

అనంతపురం రూరల్, జూలై 28: రైతులకు విద్యుత్ సమస్యలు రానివ్వద్దని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ ఎమ్మెల్యేను కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల గురించి ఎస్ఈతో చర్చించారు. నియోజకవర్గంలో చాలా చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య ఉందన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే వ్యవసాయాకి అందే విద్యుత్‌లో ఎలాంటి అవాంతరాలు కలగకూడదన్నారు. వీటన్నింటిపై రిపోర్టు తెప్పించుకుని సమస్యలు పరిష్కరిస్తామని ఎస్ఈ తెలిపారు. డీఈఈలు రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించండి: మండలంలోని పాపంపేట పంచాయతీ కళ్యాణదుర్గం-బళ్లారిరోడ్డు సమస్యపై టీడీపీ నాయకులు, స్థానికులు ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆదివారం క్యాంపు కార్యాలయంలో కలిశారు. స్థానికులు మాట్లాడుతూ.. లింక్ రోడ్డు అహుడాలో 60అడుగుల రోడ్డు అని ఎవరో తెలియని కొందరు ప్రతిపాదించారని ఎమ్మెల్యే దృష్టి తెచ్చారు. మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, స్థానికులు బాబావలి, రామాంజనేయలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి భార్య మృతికి నివాళి


నారాయణమ్మ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు, జూలై 28: టీడీపీ మండల కన్వీనర్ పిల్లల వేణుగోపాల్ భార్య నారాయణమ్మ(50) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్లే పరిటాల సునీత ఆయన స్వగృహానికి వెళ్లి ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం వేణుగోపాల్‌తో భార్య మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, నారాయణస్వామి, క్రిష్ణమోహన్ చౌదరి, మల్లికార్జున రెడ్డి రమేష్ నాయుడు, శశాంక చౌదరి, శ్రీనివాసరెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


మొక్కలు నాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మార్కండేయులు

అనంతపురం సెంట్రల్, జూలై 28: విద్యార్థి దశనుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగిలే వారితో మొక్కలు నాటించాలని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మార్కండేయులు పేర్కొన్నారు. ఆదివారం విద్యాలయంలో విద్యార్థులతో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మార్కెండేయులు మాట్లాడుతూ ఎన్ఈపీ నాల్గవ వార్షికోత్సవాన్ని పురష్కరించుకుని ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్‌డే భాగస్వాములుగా ఏక్ పేడ్ మాకే నామ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలకు సమాజ సేవకుల పేర్లు హర్షణీయం

అనంతపురం విద్య, జూలై 28: ప్రభుత్వ పథకాలకు సమాజ సేవకుల పేర్లు పెట్టడం హర్షణీయని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య, ప్రధానకార్యదర్శి నాయకులు రవీంద్ర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ విద్యాశాఖలోని పాఠశాల విద్యార్థులకు ఇచ్చే విద్యాకానుకకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో, మధ్యాహ్నబోజన పథకానికి ప్రముఖ సమాజ సేవకురాలు, అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరును పెట్టడం ప్రశంసనీయమన్నారు. అదేవిధంగా ఆణిముత్యాలు పథకానికి అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారాలుగా, నాడు-నేడుకు మనబడి-మన భవిష్యత్తుగా పేర్లు పెట్టడం స్వాగతించదగ్గ పరిణామం అన్నారు.

అవోపా అధ్యక్షుడిగా భవనాసి వెంకటేష్‌బాబు

అనంతపురం కల్చరల్, జూలై 28: ఆర్య వైశ్య అఫిషియల్స్, పెన్షనర్స్ అసోసియేషన్(అవోపా) జిల్లా నూతన అధ్యక్షుడిగా భవనాసి వెంకటేష్‌బాబు ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం అవోపా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఫైనాన్స్ కార్యదర్శి శంకరనారాయణ, చీఫ్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు సమక్షంలో నూతన అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా వెంకటేష్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు జయంతి శ్రీనివాసులుశెట్టి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరామ్ సుధాకర్, జనార్ధన్, మంజునాథ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.



అధ్యక్షుడు వెంకటేష్‌బాబును సత్కరిస్తున్న అవోపా నాయకులు

జీబీసీ, పీఏబీఆర్ కాలువకు నీటి విడుదల

ఉరవకొండ, జూలై 28: హెచ్చెల్సీకి అనుబంధంగా ఉన్న పీఏబీఆర్ కాలువకు, జీబీసీ (గుంతకల్లు బ్రాంచ్ కెనల్)కి నీటిని వదిలినట్లు అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని నింబగల్లు సమీపం వద్ద జీబీసీకి షెట్టర్లు ఎత్తి నీటిని వదిలామన్నారు. పీఏబీఆర్‌కు 400క్యూసెక్కులు, జీబీసీకి 150క్యూసెక్కులు వదిలినట్లు హెచ్చెల్సీ డీఈ మద్దిలేటి తెలిపారు. తాగునీటి అవసరాల కోసం వదిలామన్నారు.

హైకోర్టులో అప్పీల్ వెనక్కు తీసుకోవాలని వినతి

ఉరవకొండ, జూలై 28: గత వైసీపీ ప్రభుత్వంలో హైకోర్టులో హోంగార్డులపై వేసిన అప్పీల్‌ను వెనక్కు తీసుకోవాలని ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్‌ను హోంగార్డుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కృష్ణయ్య కోరారు. అనంతపురంలోని రాంనగర్‌లో ఆదివారం ఆయన మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. 2021వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను అమలు చేయాలని మంత్రిని కోరారు. గత ప్రభుత్వ హయాంలో మా సమస్యలను చెప్పుకోవడానికి కూడా వీలు లేకుండా పోయిందన్నారు. మీరైనా స్పందించి మాకు న్యాయం జరిగేలా చూడాలని మంత్రిని కోరారు.

ఘనంగా ఆషాఢ దిండి వేడుకలు

ఉరవకొండ, జూలై 28: పట్టణంలో ఆదివారం భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఆషాఢ దిండి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వీరశైవ నగర్‌లోని విఠల్ రుక్మిణీ ఆలయంలో పాండురంగస్వామికి ప్రత్యే పూజలు చేశారు. అనంతరం స్వామి చిత్రపటాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కీర్తనలు ఆలపించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి

పామిడి, జూలై 28: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలోని సెప్టిక్ ట్యాంకును ఆదివారం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వడ్డే శివకుమార్ సొంత నిధులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి నల్లబోతుల శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

గుంతకల్లుటౌన్, జూలై 28: స్థానిక 37వ వార్డుకు చెందిన హుసేన్ ఆదివారం మృతిచెందారు. దహన సంస్కారాలకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే హుసేన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చిప్పగిరి ప్రతాప్, హనుమంతు, చికెన్‌జగన్, మెకానిక్‌మస్తాన్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుంతకల్లుటౌన్, జూలై 28: పట్టణ శివారులోని ఎస్టేట్ ఏరియాలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుత్తికి బొలేరో వాహనంలో అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తుండగా ఎస్టేట్ ఏరియాలో పోలీసులు, రెవన్యూ అధికారులు దాడులు చేశారు. 40 బ్యాగుల్లోని 23 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వ్యాపారి రామచంద్రను, డ్రైవర్ సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

గుంతకల్లుటౌన్, జూలై 28: జనసేన క్రియాశీలక సభ్యత్వం జనసైనికులకు భరోసా అని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పూలరమణ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద రెండో రోజైన ఆదివారం ఆయన కార్యకర్తలతో కలిసి పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న జనసైనికులకు ప్రమాద, జీవిత బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కురువ పురుషోత్తం, నాయకులు గోపి, ఎర్రిస్వామి, బద్రి, వీరేష్, పాండు, వక్కల ఉమ, ప్రేమలత, స్రవంతి, ఉష, స్వర్ణలత, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంరూరల్, జూలై 28: మండలంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ఆదివారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో వృక్షశాస్త్రం, వాణిజ్యశాస్త్రం సబ్జెక్టులు బోధించేందుకు అధ్యాపకులు అవసరమని, అందుకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అన్నారు. పీజీ కోర్సులో 55 శాతం ఉత్తీర్ణ శాతం ఉండి నీట్‌సెట్ పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. అర్హులు దరఖాస్తుతో సోమవారం కళాశాలకు రావాలని సూచించారు.

చిరుత మృతి

కూడేరు, జూలై 28: మండల కేంద్రం సమీపంలోని రామదుర్గం కొండలో చిరుత మృతి చెందినట్లు గొర్రెల కాపరులు గుర్తించారు. చిరుత కళేబరాన్ని బట్టి చూస్తే వారం రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చునని తెలుస్తోంది. గత శనివారం కూడేరుకు చెందిన కొందరు గొర్రెల కాపరులు సమీపంలోని రామదుర్గం ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న కొండలోకి గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. అక్కడ అడవిలో చిరుత మృతి చెందిన విషయం గుర్తించారు. ఆదివారం గ్రామంలోకి వచ్చి సన్నిహితులకు తెలపడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

పుట్లూరు, జూలై28: రాష్ట్ర ప్రభుత్వం పథకాలకు భావితరాలకు స్ఫూర్తిని అందించే సమాజ సేవకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లు పెట్టడం హర్షణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు రామాంజియాదవ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పలు పథకాలను సర్వేపల్లి రాధాకృష్ణ, డొక్కాసీతమ్మ, అబ్దుల్‌కలాం పేర్లతో అమలు చేయాలని నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ల పాలన అభినందనీయమని కొనియాడారు.

పౌష్టికాహారం తప్పనిసరి

తాడిపత్రి, జూలై28: చిన్నారులు, మహిళలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు కౌసర్‌బేగం సూచించారు. పట్టణంలోని రోటరీక్లబ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పిండిపదార్థాలు, పీచుపదార్థాలు, పండ్లు, కూరగాయలు తదితర వాటిని తరచుగా తీసుకోవడం వల్ల రక్తహీనతను తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రేణుకాదేవి, కోశాధికారి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో టమోటాకు సోకిన మచ్చతెగులు



రాలిపోయిన పూత



జడివానతో ఎండిపోతున్న టమోటా మొక్క

జడి వానతో రైతన్న కుదేలు

- వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న జడివాన
- పంటలకు సోకుతున్న మచ్చతెగులు
- వాతావరణ మార్పులతో రాలిపోతున్న పూత
- టమోటా పంటపై అధిక ప్రభావం
- గణనీయంగా తగ్గిపోతున్న దిగుబడి
- ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం శూన్యం

కళ్యాణదుర్గం, జూలై 28: జడివానతో అన్నదాత కుదేలవుతున్నాడు. పంట ఎదుగుదల వచ్చే సమయంలో వర్షం ప్రభావంతో మచ్చతెగుళ్లు సోకుతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా.. వర్షం ధాటికి ఉపయోగం లేకుండా పోతోంది. నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ ప్రాంతాల్లో సుమారు 800 ఎకరాలకు పైబడి రైతులు కర్బూజ, కళింగర, టమోటా, బీర, మిరప, వేరుశనగ పంటలు సాగు చేశారు. ఈసారి ఎక్కువగా టమోటా, కర్బూజ పంటలను సాగు చేశారు. కాగా వారం రోజులుగా కురుస్తున్న జడివానతో టమోటాకు మచ్చతెగులు వచ్చి పూత రాలిపోతోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఈ జడివాన ఎక్కువగా టమోటా మీదనే ప్రభావం చూపుతోంది. గత నెలరోజుల నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంటకు వారం రోజులుగా కురుస్తున్న జడివాన, వాతావరణ మార్పులతో పూతంతా నిట్టనిలువునా రాలిపోతోంది. దీంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. టమోటా ఎకరాకు 15 కేజీల బాక్సు 1000 నుంచి 1500 బాక్సులు దిగుబడి రావాల్సి ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితి కారణంగా ఎకరాకు 400 నుంచి 500 బాక్సుల వరకు మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పంటను కాపాడుకునేందుకు ఖర్చు విపరీతంగా పెరిగిపోతోంది. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.80 వేల ఖర్చు అవుతోందని రైతన్నలు వాపోతున్నారు. ఏది ఏమైనా జడివాన అన్నదాతలకు దడ పుట్టించి, ఆర్థికంగా నష్టానికి గురి చేసింది.

జడివానతో ఇబ్బందులు పాలవుతున్నాం



గత వారం రోజులుగా కురుస్తున్న జడివానతో ఇబ్బందులు పాలవుతున్నాం. దీంతో పాటు వాతావరణంలో మార్పుల కారణంగా టమోటా పంట దిగుబడి కూడా పూర్తిగా తగ్గుతోంది. తనకున్న మూడు ఎకరాల్లో సాగు చేసిన టమోటా ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. పెట్టుబడి కూడా దక్కేలా లేదు.

-రామాంజి, రైతు, మేళ్లకుంట

రాలిపోతున్న పూత



వాతావరణ మార్పులతో టమోటాకు ఉన్న పూత రాలిపోతోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. దాంతో పాటు జడివానతో మచ్చతెగులు సోకుతోంది. ఆకులన్నీ ముడుచుకుపోతున్నాయి. ఏమిచేయాలో అర్థంకావడం లేదు.

-రవి, రైతు, కళ్యాణదుర్గం

మంత్రి కేశవ్‌ను కలిసిన ఎస్పీ

ఉరవకొండ, జూలై 28: రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నులు, శాసనసభా వ్యవహారాల శాఖల మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం కలిశారు. జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో గల నివాసంలో మంత్రిని కలిసి పూలమొక్కను అందజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.



మంత్రికి పూలమొక్కను అందజేస్తున్న ఎస్పీ

మంత్రికి సన్మానం

కూడేరు: రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్‌ను కూడేరు ఎంఈఓ చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ నాయకులు ఆదివారం జిల్లాకేంద్రంలోని ఆయన నివా సంలో కలిశారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాతో సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు.

మిద్దెపై నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు

తాడిపత్రి, జూలై28: పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద మిద్దె పైనుంచి కిందపడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన నరేష్, కిరణ్‌కుమార్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కాగా ఆ ఇద్దరూ ఆదివారం మధ్యాహ్నం మద్యం సేవించేందుకు కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న ఒక మిద్దెపై కూర్చొన్నారు. కొద్దిసేపటి తర్వాత మద్యం మత్తులో ఉన్న నరేష్ ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

యాడికి, జూలై28: మండలంలోని రాయలచెరువు వద్ద ఆదివారం ఆటో బోల్తా పడి డ్రైవర్ షెక్షావలి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గుత్తిలోని సీపీఐ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ షెక్షావలి గుత్తి నుంచి రాయలచెరువుకు ఆటోలో వచ్చాడు. పనుల అనంతరం తిరిగి గుత్తికి బయలుదేరాడు. రాయలచెరువు గ్రామసమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో అతను గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తాడిపత్రి, జూలై28: పెద్దపప్పూరు మండలం తబ్జుల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడని పోలీసులు తెలిపారు. శింగనమల మండలం గోవిందరాయునిపేట గ్రామానికి చెందిన ఆంజనేయులు (75) ప్రతి ఆదివారం పెద్దపప్పూరు మండలంలోని నారప్పతాత ఆలయానికి వస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఆలయానికి ద్విచక్రవాహనంలో వస్తుండగా తబ్జుల గ్రామ సమీపంలోని స్పీడ్‌బ్రేకర్ వద్ద అదుపుతప్పి బోల్తాపడ్డాడు. ప్రమాదంలో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతిచెందాడని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు పిల్లలు ఉన్నారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేస్తామని వారు చెప్పారు.

25 గొర్రెపిల్లలు మృతి

బెళుగుప్ప, జూలై 28: మండలంలోని దుద్దేకుంటలో ఆదివారం గొర్రెపిల్లలు అకస్మాత్తుగా మృతిచెందాయి. వివరాల్లోకెళ్తే.. యజమానులు హనుమంతప్ప, యర్రిస్వామి, రమేష్ 25 గొర్రె పిల్లల్ని ఉదయం జాలరీ ఉన్న దొడ్లో వదిలివెళ్లారు. తర్వాత సాయంత్రం వచ్చి చూడగా అన్నీ చనిపోయి పడిఉన్నాయి. ఎందుకు మృతి చెందాయో అంతుచిక్కడం లేదని యజమానులు వాపోయారు. రూ.లక్షకుపైగా నష్టపోయామని ఆవేదన చెందారు. ఈ విషయమై పశువైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ పోస్టుమార్టమ్ నిర్వహిస్తే ఎందుకు చనిపోయాయో తెలుస్తుందని తెలిపారు.

జీపుజాతాను జయప్రదం చేయండి

రాయదుర్గంరూరల్, జూలై 28: జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఆగస్టు ఒకటో తేదీ నుంచి జిల్లాలో నిర్వహించే జీపుజాతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏపీఎన్‌జీఓ భవనంలో ఆదివారం ఆయినన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 1వ తేదీన ప్రారంభయమ్యే జీపుజాతా మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. నార్పలలో ప్రారంభమై తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కణేకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, రాప్తాడు వరకు కొనసాగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు విడుదల కాలేదని, జిల్లాలో చాలా హాస్టళ్లకు సొంత భవనాలు లేవని, పలు హాస్టళ్లలో కనీస వసతులు లేవని, వాటిని కల్పించాలని కోరుతూ జీపుజాతా చేపట్టనున్నట్లు తెలిపారు. జీపుజాతా అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు అభిషేక్, మధు, భాను, కార్తీక్, పవన్, రాందాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పామోలిన్ మొక్కల పెంపకానికి శ్రీకారం

బొమ్మనహాళ్, జూలై 28 : మండలంలోని నేమకల్లు గ్రామంలో సోమవారం పామోలిన్ ఆయిల్ మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టినట్లు టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ డైరెక్టర్ మహేంద్ర ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చేతుల మీదుగా ముత్తు ఆంజనేయ అనే రైతు పొలంలో పామోలిన్ ఆయిల్ మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు.

కురుబసంఘం మండల కమిటీ ఎన్నిక

బొమ్మనహాళ్, జూలై 28: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివాలయంలో ఆదివారం కురుబ సంఘం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా బెళ్లి హనుమంతరెడ్డి, అధ్యక్షుడిగా కే నాగరాజు, ఉపాధ్యక్షుడిగా వన్నూరుస్వామి, జనరల్ సెక్రెటరీగా ఎంఆర్‌సీ మల్లన్న, కోశాధికారి ఎర్రిస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాలాక్షి, సభ్యుడిగా రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఎస్‌కే మల్లికార్జున ఆధ్వర్యంలో ఈ ఎన్నికల జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉద్దేహాళ్ శివ, గాలి బసప్ప, లాలూస్వామి, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ కేబుల్ చోరీ

రాయదుర్గంరూరల్, జూలై 28 : మండలంలో మల్లాపురం, మల్లాపురం తండా ప్రాంతాల్లో ని పొలాల్లో మోటార్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు రైతులు కమలాక్షుడు, నరసింహులు, విరూపాక్షి, మాల సిద్దప్ప, నీలకంఠారెడ్డి ఆదివారం వాపోయారు. శనివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగిందని, ఏడు విద్యుత్ మోటార్లకు ఏర్పాటు చేసిన వైర్లను కట్ చేసి అపహరించుకుపోయారని చెప్పారు. ఒక్కొక్క రైతుకు సంబంధించి 30 నుంచి 50 మీటర్ల వైరు చోరీ అయిందన్నారు. మొత్తంమీద రూ. 30 వేల దాకా నష్టం వాటిల్లిందన్నారు. ఈ ఏడాదిలోనే ఐదుసార్లు ఇలాంటి చోరీలు జరిగాయన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించాలని వారు కోరారు.

వ్యాధుల భయం..!

- గుంతకల్లులో రంగుమారి, పురుగులు పడిన నీరు సరఫరా
- వాటిని ఎలా తాగాలంటూ స్థానికుల ఆవేదన
- మున్సిపాలిటీ నీరు సురక్షితమేనా అన్న సందేహం



రంగుమారిన తాగునీరు



డ్రైనేజీలో ఉన్న తాగునీటి పైపులు

గుంతకల్లుటౌన్, జూలై 28: పట్టణంలోని ఇళ్లకు తాగునీరు రంగుమారి, పురుగులు పడి, పాచిపట్టి సరఫరా అవుతున్నాయి. దీంతో మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న తాగునీరు సురక్షితమేనా అనే సందేహాలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. కాలం చెల్లిన పైపులైన్లకు లీకేజీలు పడడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. పలుచోట్ల మురుగునీటి కాలువల్లో పైపులైన్లు ఉండటం మరింత ప్రమాదకరంగా మారింది. పలు కాలనీల్లో మూడు, నాలుగు, ఐదు రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నారు. కానీ పైపు లైన్ లీకేజీ ఉన్న ప్రాంతాల్లో వారం నుంచి పది రోజులకు ఒకసారి మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. కాగా చాలాప్రాంతాల్లో మున్సిపల్ కొళాయిల ద్వారా కలుషిత నీరు వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఎస్ఎస్ ట్యాంక్‌ల ద్వారా నీటిని ఫిల్టర్ చేయకుండానే నేరుగా కొళాయిలకు సరఫరా చేస్తున్నారా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఏకలవ్య నగర్‌లో శనివారం రాత్రి మంచినీటికి బదులు పురుగులు పడిన మురుగు నీరు వచ్చాయని కాలనీ వాసులు వాపోయారు. ఈ నీరు ఎలా తాగాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీరు వస్తోందని వాటర్ మెన్‌కు చెబితే.. పైపులీకేజీ వల్ల అలా వస్తున్నాయని, మరమ్మతులు చేయిస్తాంలే అని అతను నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని మండిపడ్డారు. ఇంకా పలు కాలనీల్లో సైతం తాగునీటి కొళాయిల ద్వారా కలుషిత నీరు వస్తోందని, ఈ సమస్యపై ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేశామని, అయినా ఎవరూ స్పందించలేదని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు.

తాగునీటిలో పురుగులు వస్తున్నాయి



మున్సిపల్ కొళాయిల నుంచి పురుగులు పడి, పాచి పట్టిన నీరు వస్తోంది. ఆ నీటిని ఎలా తాగాలి. నాలుగు రోజులకోకసారి తాగు నీరు వస్తుంది. ఫిల్టర్ చేయకుండానే సరఫరా చేస్తున్నారు. వాటిని తాగి రోగాల బారిన పడుతున్నాం. నీటిని శుద్ధి చేసిన తరువాత కొళాయిలకు వదలాలి.

- మాధవప్రకాష్, ఏకలవ్యనగర్, గుంతకల్లు

ఎవరూ పట్టించుకోవడం లేదు



మున్సిపల్ కొళాయిలకు రంగు మారిన నీరు వస్తోందని వాటర్‌మెన్‌కు, అధికారులకు విన్నవించాం. ఆ నీరు తాగితే జ్వరాలు వస్తున్నాయి. సమస్యను వాటర్‌మెన్‌కు చెబితే అధికారులకు చెప్పండి అని నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడు.

- గౌస్, ఆచారమ్మకొట్టాల, గుంతకల్లు

లీకేజీలకు మరమ్మతులు చేయిస్తాం

మురుగుకాలువలో వెళ్లిన పైప్‌లైన్లను మారుస్తాం. స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి లీకేజీలకు మరమ్మతులను చేయిస్తాం. శుద్ధిచేసిన తరువాత మున్సిపల్ కొళాయిలకు తాగునీరు సరఫరా చేస్తాం.

- హరికృష్ణ, మున్సిపల్ ఏఈ

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



ఎస్ఎస్ ట్యాంకు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు, జూలై 28: తాము అధికారంలోకి ఉన్నంత వరకు రాయదుర్గం పట్టణానికి తాగునీటి సమస్య రాకుండా చూస్తామని ఎమ్మెల్యే కాలువల శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలో గల సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకుకు ఆదివారం ఆయన అధికారికంగా పూజలు చేసి హెచ్చెల్సీ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో రాయదుర్గం పట్టణవాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పటి నుండి అలాంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తల చర్యలు చేపడతామన్నారు. 80 వేల జనాభాకు అవసరమైన నీటిని ఇచ్చేందుకు ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. అలాగే రూ. 32 కోట్లతో నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు కూడా ప్రభుత్వానికి నివేదికను అందిచామన్నారు. గతంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పనుల్లో నాణ్యత కొరవడడంతో పలుసార్లు మరమ్మతులకు గురై పట్టణవాసులు తాగునీటి కోసం ఇబ్బంది పడ్డారన్నారు. భవిష్యత్తులో ఇలాంటికి మళ్లీ రాకుండా ఉండాలని ముందు జాగ్రత్తలు చేపడుతున్నామన్నారు. నీటి పంపింగ్ విషయంలో విద్యుత్, మున్సిపల్ అధికారులకు వస్తున్న సమస్యను సమన్వయం చేసి ఇరువురి మధ్య ఇబ్బందులు రాకుండా చూస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పొరాళు శిల్ప, మున్సిపల్ డీఈ సురేష్, టీడీపీ నాయకులు టంకశాల హనుమంతు, కడ్డిపూడి మాబు, పొరాళు పురుషోత్తం, బండి భారతి, కౌన్సిలర్ ప్రశాంతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

చెరువు వద్ద కల్వర్టు పరిశీలన

కణేకల్లులోని చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు వద్ద టీడీపీ నాయకులు సొంత నిధులతో నిర్మించిన కల్వర్టును ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, అలాగే రాయలసీమలోని కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు వరప్రదాయనిగా ఉన్న తుంగభద్ర డ్యాం నీటితో నిండుకుండగా జలకళను సంతరించుకుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు సమృద్ధిగా పంటలు పండించుకునేందుకు అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. హెచ్చెల్సీకి నీటి రాకతో రైతాంగం మొత్తం సంతోషంతో ఉందన్నారు. త్వరలోనే ఐఏబీ సమావేశాన్ని నిర్వహించి రైతుల పొలాలకు నీటి విడుదల చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా, అనిల్, చాంద్‌బాషా, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలని వినతి

గుంతకల్లుటౌన్, జూలై28: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను స్థానిక బీజేపీ నాయకులు కోరారు. అనంతపురంలో ఆదివారం వారు మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ మాట్లాడుతూ.. రోగుల పట్ల ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతి చిన్న విషయానికి కర్నూలు, అనంతపురానికి రెఫర్ చేస్తున్నారని తెలిపారు. వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న వైద్యులు, ల్యాబ్‌టెక్నిషియన్లు, నర్సులు పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పురందర్, బండారుకృష్ణమూర్తి, విశ్వనాథ్, మునిరాజు, సురేష్, గుర్రంసూర్యనారాయణ, జీఎం మహేష్, శ్రీదేవి పాల్గొన్నారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తరిమెల నాగిరెడ్డికి నివాళి

గుంతకల్లు టౌన్, జూలై 28: పట్టణంలోని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ కార్యాలయంలో ఆదివారం విప్లవ యోధుడు తరిమెల నాగిరెడ్డి వర్ధంతిని జరిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ కర్నూలు జిల్లా కార్యదర్శి మల్లికార్జున, గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బీ సురేష్, ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మణి, ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి హనమంతు, సభ్యులు పాల్గొన్నారు.



తరిమెల నాగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జేసీపీఆర్‌ను కలిసిన రవాణామంత్రి

తాడిపత్రి, జూలై28: మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నేత జేసీ పవన్ రెడ్డిలను రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి మధ్య రాష్ట్ర రాజకీయాలపై చర్చ సాగినట్లు తెలుస్తోంది. అలాగే తాడిపత్రిలో అభివృద్ధి పనులపై మంత్రి ఆరా తీసినట్లు సమాచారం.



జేసీ ప్రభాకర్‌రెడ్డితో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

తాడిపత్రి, జూలై28: రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ కోరారు. పట్టణంలోని నెహ్రూపార్కులో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బోర్డులో 4లక్షలమంది కార్మికులు సభ్యత్వాన్ని తీసుకున్నారన్నారు. బోర్డు నుంచి కార్మికులకు 7రకాల పరిహారం ప్రభుత్వం ఇచ్చేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మాత్రం బోర్డు నుంచి రూ.18కోట్లను నవరత్నాల పథకాలకు మళ్లించిందని తెలిపారు. 32వేలమంది పరిహారం కోసం దరఖాస్తు చేసుకుంటే పరిహారం ఇవ్వలేదన్నారు. ఉచిత ఇసుకను అమలుచేయడంపై కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ ప్రభుత్వమైనా సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని వారు కోరారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మికులు ఉమాగౌడ్, రమణ శ్రీనివాస్, రామాంజనేయులు, సూరి, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలోనే కొండలను కొల్లగొట్టారు

బొమ్మనహాళ్, జూలై 28 : మండలంలోని నేమకల్లు గ్రామ శివారులో ఉన్న కొండలను వైసీపీ ప్రభుత్వ హయాంలో కొల్లగొట్టారని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మార్కెట్‌యార్డ్ మాజీ డైరెక్టర్ మహేంద్ర, టీడీపీ నాయకులు గాలి బసప్ప ఆరోపించారు. మండలకేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. నేమకల్లు కొండల నుంచి అనుమతులు లేకుండా కంకరను కర్ణాటకకు తరలిస్తున్నారని వచ్చిన ఆరోపణలను ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు కొండను కొల్లగొట్టి దోపిడీ చేశారని విమర్శించారు. రాయల్టీలు కూడా చెల్లించకుండా కంకరను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారని తెలిపారు. అప్పుడు చేసిన దోపిడీ చాలక తిరిగి మళ్లీ అక్రమంగా తవ్వేందుకు ప్రయత్నిస్తూ ఇతరులపై అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు.

త్రిపుర సుందరీదేవికి బోనాలు

గుంతకల్లుటౌన్, జూలై 28: పట్టణంలోని నాగప్పకాలనీలో గల త్రిపుర సుందరీ దేవి అమ్మవారికి ఆదివారం బోనాలు సమర్పించారు. ప్రధాన అర్చకుడు రామస్వామి ఉదయమే ఆలయంలోని అమ్మవారికి అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, నీలకంఠ, సత్యనారాయణ, రమేష్‌బాబు, రవికుమార్, వెంకటేశులు, భాస్కర్, శివస్వామి తదితరులు పాల్గొన్నారు.



బోనాలను తీసుకెళ్తున్న మహిళలు